క్లుప్తంగా

నేడు గుడివాడలో గడప గడపకు

ఎస్.రాయవరం : మండలంలో గుడివాడ గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకుంటారన్నారు.

సాగునీటి కాలువలకు జలకళ


సాగునీటితో కళకళలాడుతున్న శీలప్పన్న చెరువు

మునగపాక : మండలంలోని పలు సాగునీటి కాలువలు సాగునీటితో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌కు సంబంధించి సాగునీటి కాలువల ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు బిజీగా ఉన్నారు. పలు చోట్ల ఆకుమడులకు దుక్కులు చేయడం, మరికొంత మంది వరినారును పెంచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దమ్ము చేసే పనిలో పలువురు రైతులు నిమగ్నమై ఉన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పలు సాగునీటి కాలువల్లో నీరు ప్రవహిస్తుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునగపాకలోని కృష్ణంరాజు కాలువ, శీలప్పన్న చెరువు, తోటాడ ఆవ కాలువ, రోలుగెడ్డ తదితర ప్రాంతాల్లో సాగునీటి కాలువల్లో నీరు వచ్చి చేరుతుంది.

ఆలయ నిర్మాణానికి విరాళం

రాంబిల్లి : మామిడివాడలో నిర్మిస్తున్న పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సమావేశమై విరాళాలు సేకరించారు. పెందుర్తి మండలం పెదనరవ గ్రామానికి చెందిన పైల వారి కుటుంబ సభ్యులు రూ.1.72 లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నెట్టెం సత్యనారాయణ, కన్నం రమణారావు, కరెడ్ల నాగరాజు పాల్గొన్నారు.

ములబందగోడి రైతు సంఘ అధ్యక్షునిగా రామునాయుడు


ములబందగోడి రైతు సంఘు నూతన కార్యవర్గం

మునగపాక : ములబందగోడి రైతు సంఘు అధ్యక్షునిగా బొడ్డేడ రామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వినాయక ఆలయం ఆవరణలో ఆదివారం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షునిగా రామునాయుడు, కార్యదర్శిగా దాడి శివకృష్ణ, కోశాధికారిగా సూరిశెట్టి సంంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా బొడ్డేడ రమణబాబు, కొయిలాడ సత్యనారాయణ, సూరిశెట్టి నాగ దుర్గునాయుడు, దొడ్డి శివ, యల్లపు పరదేశినాయుడు, దాడి గణేష్, దాడి త్రినాథ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా దాడి సూర్యనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు రామునాయుడు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రాజుపేట చెరువులో అక్రమంగా మట్టి తరలింపు


రాజుపేట చెరువులో మట్టి తవ్వకాలు

మునగపాక : రాజుపేటలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. రాత్రుల సమయంలో అక్రమార్కులు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని దళాయి వారి కళ్లాల వద్ద ఉన్న చెరువు నుంచి భారీగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రుల సమయంలో ట్రాక్టర్లపై మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటుక బట్టీలకు ఇసుక తరలించుకుపోతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలపై దృష్టి సారించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వషయమై తహసీల్దార్ ప్రకాశరావు దృష్టికి తీసుకురాగా మట్టి తరలింపు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. సేవలు భేష్

- ఆదర్శంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న రోగులు


మల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న డాక్టర్ విమలగిరి


గ్రామంలో వైద్య సిబ్బంది క్యాంపు నిర్వహించి, రోగులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం


సీతారాంపురం గ్రామంలో వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్ గ్రామాల్లో ప్రజలు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేయడం వల్ల రోగులు దూరప్రాంతాలకు వెళ్లకుండా, పీహెచ్‌సీలకు కూడా వెళ్లకుండా వైద్యులు వైద్య సిబ్బంది వైద్యం అందించడం వల్ల రోగులు వ్యయ, ప్రయాసలు పడకుండా వైద్య సేవలు పొందుతున్నారు. మండలంలో పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయా పీహెచ్‌సీల పరిధిలో అయా గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను వైద్య సిబ్బంది సందర్శించి సేవలు అందిస్తున్నారు. పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి విద్యాసాగర్ అందించిన వివరాల ప్రకారం పీహెచ్‌సీ పరిధిలో నెలకు 18 శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి శిబిరానికి కనీసం 100 మంది రోగులు హాజరై వైద్య సేవలు పొందుతున్నారు. మంగవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి ఎం.కిషోర్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం పీహెచ్‌సీ పరిధిలో నెలకు 12 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి శిబిరానికి 60 నుంచి 80 మంది వరకు రోగులు హాజరై, వైద్య సేవలు పొందుతున్నారు. శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాల్లో నెలకు 20 శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి శిబిరానికి 80 మంది వరకు రోగులు హాజరై వైద్య సేవలు పొందుతున్నట్టు వైద్యాధికారిణి పి.కావ్య తెలిపారు. ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం వద్దకు హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరాల వద్దకు రాలేక, ఇంటి వద్దనే మంచం పైనే వుంటున్నా రోగుల వద్దకు వైద్య బృందం వెళ్లి వైద్య పరీక్షలు, సలహాలు అందించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుంది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమై ప్రతి నెలా ప్రతి గ్రామంలోను వైద్య బృందం సేవలు అందించడంపై గ్రామీణ ప్రాంత ప్రజలు, రోగులు ఆనందం వ్యక్తం చేస్తూ, వైద్య సేవలు పొందుతున్నారు.

ఇప్పటి వరకూ 87 శిబిరాలు

నక్కపల్లి : మండలంలో గొడిచర్ల పీహెచ్‌సీ ద్వారా విలేజ్ క్లినిక్ ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందుతున్నాయి. ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 87 క్యాంపులు నిర్వహించారు. 9740 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు చేస్తున్నారు. 8540 మందికి టెలీ కన్సల్టెన్సీ సేవలు నిర్వహించారు. సగటున నెలకు 23 శిబిరాలు జరుగుతున్నాయి.

ఉచితంగా 14 రకాల పరీక్షలు

మునగపాక : మండలంలో రెండు పీహెచ్‌లు ఉన్నాయి. మునగపాక, చూచుకొండ గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉండగా ప్రతి గ్రామంలో రెండుసార్లు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలందిస్తున్నారు. వైద్యులు తమకు కేటాయించిన గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ నిర్వహించి అనంతరం వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి అక్కడికక్కడే మందులు, పలు రకాల పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందజేస్తున్నారు. ప్రతి రోజూ 80కు పైగా ఓపీ వస్తున్నాయి. అలాగే గర్భిణులకు అవసరమనుకుంటే ఈసీజీ సేవలందిస్తున్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానం సేవలందించే గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యాధికారి సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమని అవగాహన కల్పిస్తున్నారు.

నెలకు రెండు శిబిరాలు

ఎస్.రాయవరం : మండలంలో సర్వసిద్ధి, పెనుగొల్లు కేంద్రాలు గా రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో 7 వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సొంత భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం విలేజ్ క్లినిక్ వైద్య సేవలు ప్రారంభించినప్పటి నుంచి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి నెలకు రెండు దఫాలు వైద్యులు రావడంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ మేరకు శనివారం సైతారుపేట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వాసంతి, 80 మంది రోగులకు వైద్య పరీక్షలు అందివ్వగా, 28 మంది రక్త పరీక్షలు, బీపీ ఇతర పరీక్షలు చేయించుకున్నారు. పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో వమ్మవరం గ్రామంలో నెలలో రెండవ సారి శనివారం విలేజ్ క్లినిక్ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రాజేశ్వరి 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో 12 వెల్ నెస్ సెంటర్లు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు.

ప్రజల నుంచి స్పందన



ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ విధానం అందుబాటులోకి వచ్చాక ప్రజల నుంచి స్పందన వస్తుంది. తమకు కేటాయించిన గ్రామాలకు వైద్యం కోసం ప్రజలు వచ్చి సేవలు పొందుతున్నారు. సీజన్‌కు తగిన ఆహారం తీసుకోవడంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నాం. బాలింతలు, గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రజల వద్దకే వెళ్లి సేవలందించే కార్యక్రమం సంతృప్తికరంగా ఉంది.

– నంది విమలగిరి, పీహెచ్‌సీ వైద్యాధికారి, మునగపాక

నేడు దిబ్బపాలెంలో జగనన్న సురక్ష

అచ్యుతాపురం (అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల సచివాలయ కన్వీనర్ రాజాన విజయ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ విచ్చేస్తారని, వారి చేతుల మీదుగా ధ్రువపత్రా లు అందజేస్తారని ఆయన తెలిపారు.

గంటవానిపాలెంలో..

మునగపాక : గంటవానిపాలెం గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు హాజరై అర్హులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

నేడు జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : మండలంలో వమ్మవరం, పెదగుమ్ములూరు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. వమ్మవరంలో తహసీల్దార్ బృందం, పెదగుమ్ములూరు ఎంపీడీవో బృందం అందుబాటులో ఉంటారని చెప్పారు. కేటాయించిన వివిధ శాఖల అధికారులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని చెప్పారు.

17వ రోజుకు గిరిజనుల దీక్ష

కోటవురట్ల : అణుకు గిరిజన గ్రామానికి రహదారి నిర్మించాలని గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో గిరిజనులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 17 వ రోజుకు చేరుకుంది. సిపిఎం నాయకుడు జి.డేవిడ్ రాజు సంఘీభావంగా దీక్షలో కూర్చు ని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సమస్యలతో కాలం నెట్టుకున్నారని గ్రామంలో పాఠశాల లేకపోవడంతో చిన్నారులు చదువుకునేందుకు రానుపోను 12 కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వైద్యానికి కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని రహదారి సౌకర్యం లేక వైద్య సేవలకు తరచు డోలిమోత తప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి గిరిజనులు సమస్యలు పరిష్కరించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సర్వసిద్ధిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సర్వసిద్ధి గ్రామంలో ఆదివారం గెట్ టుగెదర్ నిర్వహించుకున్నారు. 1994–95 సంవత్సరాల్లో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న ఈ విద్యార్థులు సుమారు 28 సంవత్సరాలు తరువాత కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు, చిలిపి కబుర్లు గుర్తుకు తెచ్చుకుని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థి దశకు ఇప్పటికి వారి వారి రూపు రేఖలు బాగా మార్పు రావడంతో ఒకరినొకరు గుర్తు పట్టడంలో కబుర్లు చెప్పుకుని కేరింతలు కొట్టారు. సర్వసిద్ధి గ్రామం సమీపంలో కొబ్బరితోట నీడలు సందడి చేసిన పూర్తి విద్యార్థులు మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి కబుర్లు చెప్పుకుని సాయంత్రం వరకు సందడి చేశారు.

25న మునగపాకలో రైతు సదస్సు


మాట్లాడుతున్న రైతు సంఘు నాయకులు బాలకృష్ణ

మునగపాక : మునగపాకలో ఈ నెల 25న జరగనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా నేత బాలకృష్ణ కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంటల సాగు చేస్తున్న రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగ పరిరక్షణపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ రైతు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేయాలని, రైతుల ఆత్మహత్యలు నివారించాలని, భూయజమాని ఆమోదం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని అన్నారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకీకరించి తెరిపించేలా చూడాలన్నారు. జిల్లాలోని రైతులంతా ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు. సమావేశంలో రైతు నాయకులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, టిక్కలి జగ్గారావు, పీఏసీఎస్ విశ్రాంత సీఈవో పెంటకోట వెంకటరావు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు ఎంపీ అభినందనలు


పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక : ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సత్కరించారు. విశాఖలోని కేంద్ర గౌరీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మునగపాకకు చెందిన బొడ్డేడ ఉష్యశ్రీని ఎంపీ డాక్టర్ సత్యవతి అభినందించారు. పదిలో 600 మార్కులకు గాను 584 మార్కులు సాధించిన నేపథ్యంలో అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కేంద్ర గౌరీ సంఘ అధ్యక్షుడు బుద్ద శివాజీతో పాటు గవర కులానికి చెందిన పలువురు ఉష్యశ్రీని అభినందించారు.

పరదేశమ్మ మండపం నిర్మాణానికి భూమి పూజ


కొండకర్ల అందలాపల్లి పరదేశమ్మ ఆలయంలో మండప నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల అందలాపల్లి గ్రామంలో ఆదివారం పరదేశమ్మ వారి గుడి ముందు మండపం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, కోట్ని శివలు కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సంక్షేమం... జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- దివ్యాంగులకు ప్రభుత్వం సమకూర్చిన స్కూటీల పంపిణీ


దివ్యాంగులకు స్కూటీలు, వాటి తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ఎవరికి ఏది అవసరం ఉంటుందో తెలుసుకుని సంక్షేమ పథకాలు అందజేసే ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన లక్ష రూపాయల విలువ చేసే 11 స్కూటీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగుల పాలిట ఆశాజ్యోతిగా మారారని అన్నారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వం నుంచి సంక్షేమం అందుతోందని జనం హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో గడప గడపకూ వెళుతున్నప్పుడు ప్రతి ఇంటికి ఒకటి నుంచి 3 పథకాలు అందుతున్నాయని చెబుతున్నారని తెలిపారు. దివ్యాంగులకు తొలి విడతగా కొన్ని స్కూటీలు వచ్చాయని, మిగిలిన వారికి రెండు, మూడు విడతల్లో అందజేస్తామని తెలిపారు. దివ్యాంగులు నేరుగా దరఖాస్తు చేసుకున్న వారికి పార్టీలకతీతంగా వీటిని అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల వెల్ఫేర్ ఏడీ జగదీష్, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సర్పంచ్‌లు దారబోయిన గణేష్, పాలపర్తి పాపారావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, కేసుబోయిన వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, గొంతిన సత్యనారాయణ, చల్లపల్లి సత్తిబాబు, గరగా శ్రీనివాసరావు, పుట్టా సుధాకర్, నక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో 412 మందికి ఉచిత కంటి పరీక్షలు

- రక్తదాన శిబిరంలో 12 మంది రక్తదానం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ అపారెల్ సిటీలో ఆదివారం 111వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 412 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 264 మందికి కళ్లద్దాలు అందజేశారు. 144 మందికి మందులు అందజేశారు. 34 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 12 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ బ్రాంచ్ చైర్మన్ శివ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చల్లంగా చూడమ్మా.. నూకాలమ్మ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

17 నుంచి శ్రావణమాస ఉత్సవాలు


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు కల్యాణగిరిపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో శ్రావణమాస ఉత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించి ఆహ్వాన శుభపత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం శ్రావణమాసాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 17న శ్రావణ శుద్ధ పాడ్యమి గురువారం ఉదయం 7 గంటలకు కోటి కుంకుమార్చన జరపాలని నిర్ణయించారు. ఆగస్టు 18, 25, సెప్టెంబర్ 1, 8 తేదీల్లో శుక్రవారాల్లో కూడా కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 13న కోటి కుంకుమార్చన ముగింపు సందర్భంగా లలితా సహస్రనామ హోమం, పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. సమావేశంలో ధర్మకర్త బోయిన రమణాజీ, లక్కరాజు అప్పారావు, కోశాధికారి పోతల రమణ, ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, కోరుకొండ సాంబశివరావు, సుకురు చంద్రం, కరణం నాయుడు, మళ్ల భోగలింగం, బాదపు రామలక్ష్మి, శ్రీదేవి, కుమారి, వెంకటరావు, దాస అప్పారావు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామికి పంచామృత అభిషేకం అలాగే విశేష అర్చన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఏఎంఏఎల్ కళాశాలలో ఉపాధి కోర్సులకు వినతి

అనకాపల్లిటౌన్: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి ఏఎంఏఎల్ కళాశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలున్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని యాజమాన్యాన్ని కోరనున్నట్లు జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, రాష్ట్ర విద్యార్థి జేఏసీ నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావులు తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంఘం ఆధ్వర్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతి నెల రెండో శనివారం విద్యార్థులంతా సమావేశం కావాలని కోరారు. దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్న సుమారు లక్ష మంది పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీహెచ్ రామచంద్రరావు, కేవీఎస్ నాయుడు, పెనుమత్స కృష్ణంరాజు, వై.జగదీశ్వరరావు, కేఎస్ఎస్ శర్మ, కొణతాల రాజేంద్రప్రసాద్, బీవీ కన్నారావు, పెంటాద్రి రావు, బాలుగాడి, బీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం వ్యాయామంతో ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: నిత్య జీవితంలో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా జీవించాలంటే రోజూ వ్యాయామం చేయాలని అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ పి.ఎస్.అప్పారావు అన్నారు. అంతర్జాతీయ స్నేహ మాసోత్సవంలో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రింగ్‌రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకూ లాంగ్ వాకింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏడాది నుంచీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాకింగ్‌లో పాల్గొనే క్లబ్ సభ్యులను రెండు విభాగాలుగా విభజించి, ప్రతి విభాగానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, కార్యదర్శి భర్నికాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బుద్ద శివ తదితరులు పాల్గొన్నారు